# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

మెదక్ సంపుటి: 18 సంచిక: 34 బుధవారం, 26 మార్చి 2025 పేజీలు: 02 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com




## పంజాబ్ బోణీ

### చెలరేగిన శ్రేయస్, శశాంక్

సొంతమైదానంలో ఓడిన గుజరాత్ టైటాన్స్

శ్రేయస్ సెంచరీ జస్ట్ మిస్..

జట్టు కోసం శతకాన్ని వదులుకున్న కెప్టెన్

2

# నాకు హోం ఇష్టం



## ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా పనిచేస్తా

- కెపాసిటీ ఆధారంగా శాఖలను కేటాయించాలి
- ఢిల్లీలో మంత్రి పదవులపై జోరుగా చర్చ సాగుతోంది
- నా కైతే ఢిల్లీ నుంచి ఫోన్ కాల్ రాలేదు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో కేబినెట్ విస్తరణకు వేళైంది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ జరగనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆరు ఖాళీలుండగా.. ఈసారి నాలుగు మంత్రి పదవులను భర్తీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కూడా మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన మనసులోని మాటను బయట పెట్టారు. తనకు ఏ శాఖ ఇష్టమో కూడా తెలిపారు. తెలంగాణలో ఆసక్తకిర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అందులో ముఖ్యంగా మంత్రి వర్గ విస్తరణ ఉండబోతుందన్న వార్తలు జోరుగా

మిగతా 2లో..

## మంత్రి కన్నీళ్లు

- క్యాన్సర్ బాధితుడికి క్రికెట్ కిట్ అందజేత
- అన్నగా అండగా ఉంటానని ధైర్యం చెప్పిన శ్రీధర్ బాబు



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

"నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం సార్.. పెద్ద క్రికెటర్ కావాలని ఎన్నో కలలు గన్నా.. నాకొక క్రికెట్ కిట్ ఇప్పిస్తారా.. ప్లీజ్.." అంటూ ధీనంగా అడిగాడు క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న యువకుడు. ఆ మాటలు విని మనసున్న మనిషెవ్వరికైనా కళ్లు చెమర్చక మానవు. అచ్చంగా అదే జరిగింది. క్యాన్సర్‌తో పోరాడుతున్న

మిగతా 2లో..



## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం

- కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో గుర్తింపు
- టన్నెల్ లోనే ఇంకా ఏడు మృతదేహాలు
- నీటి ఊటతో రెస్క్యూకు ఇబ్బంది

2



## ఆ మాట విత్ డ్రా చేసుకుంటున్నా

- మహిళలంటే నాకు ఎంతో గౌరవం
- సునీతా లక్ష్మారెడ్డి నొచ్చుకొని ఉంటే క్షమించాలి
- నేను మాట్లాడింది సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి కాదు
- రన్నింగ్ కామెంట్రీపై అసహనం వ్యక్తం చేశా
- అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు తొమ్మిదో రోజు కొనసాగుతున్నాయి. నేడు వివిధ శాఖల పద్దులపై సభలో చర్చ కొనసాగుతోంది. అయితే సోమవారం సభలో తాను చేసిన కామెంట్ల వల్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మిగతా 2లో..

# కేటీఆర్.. పోలీసులతో పెట్టుకోకు..!

## గతం మరిచిపోయావా?

### ఎవరు అధికారంలో ఉంటే వాళ్లవైపే పోలీసులు

- గతంలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేయలేదా?
- ఇప్పుడు వాళ్లను బెదిరించడం కరెక్ట్ కాదు
- గతంలో నా మీద పీడీ యాక్ట్ పెట్టారు
- సొంతపార్టీ నేతలే పెట్టించారు
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

2





**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను.. గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో.. తాము అధికారంలోకి వచ్చాక పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ తీవ్ర స్పందించారు. పోలీసు శాఖతో పెట్టుకోవద్దంటూ కేటీఆర్‌ను హెచ్చరించారు. గతంలో రేవంత్ రెడ్డిని బెడ్ రూంలోకి వెళ్లి మరీ అరెస్ట్ చేసిన విషయాన్ని రాజాసింగ్ గుర్తు చేశారు. ఇప్పుడు కేటీఆర్ అధికారంలోకి వచ్చాక రిటైర్ అయిన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటామని అనడం సరికాదని రాజాసింగ్ అన్నారు. అంతేకాకుండా తనను అరెస్ట్ చేసే సమయంలో సొంత పార్టీ నేతలు కూడా పోలీసులకు

మిగతా 2లో..





# మీ ఇద్దరి హవానే నడుస్తోంది

- రాష్ట్రం మొత్తం వివేక్, కోమటిరెడ్డి ఫ్యామిలీ మీదే డిస్కషన్
- మొత్తానికి ఢిల్లీకి పోయి సాధించినవ్
- ఎమ్మెల్యే గడ్డం వివేక్ తో మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర సంభాషణ

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణ పైన ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో గత కొంతకాలంగా మంత్రివర్గ విస్తరణ పైన ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేయడానికి ముహూర్తం ఖరారైంది. ప్రస్తుతం రాష్ట్రంలో 6 మంత్రి పదవులు ఖాళీ ఉండగా ఎవరెవరికి ఇవ్వాలి అన్న విషయం పైన అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

### అసెంబ్లీ లాబీలో ఆసక్తికర సంభాషణ

అన్ని సామాజిక వర్గాలకు సమానమైన ప్రాధాన్యతను కల్పిస్తూ మంత్రివర్గంలో స్థానం కేటాయించాలని భావించినట్లు

మిగతా 2లో..

# పంజాబ్ బోణీ



**ప్రజాస్వరం, స్పోర్ట్స్ :**

ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ జట్టు పోరాడి ఓడింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది. 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. ఆ జట్టులో సాయి సుదర్శన్ (74; 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (33; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), బట్లర్ (54; 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుథర్‌ఫోర్డ్ (46; 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ భారీ లక్ష్యం కావడంతో ఓటమి చవిచూసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 2, మాక్స్‌వెల్, యాన్సెన్ ఒక్కో వికెట్ తీశారు.

**చెలరేగిన శ్రేయస్, శశాంక్..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (97*; 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) త్రుటిలో శతకం మిస్ చేసుకున్నాడు. భారీ షాట్లతో స్కోరుబోర్డును పరుగెత్తించాడు. ఆఖర్లో శశాంక్ సింగ్ (44*; 16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ప్రదర్శన చేశాడు. 19 ఓవర్లు పూర్తి అయ్యేసరికి 97 పరుగులకు చేరుకున్న శ్రేయస్ (Shreyas Iyer)కు చివరి ఓవర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆఖరి ఓవర్‌లో స్ట్రైకింగ్‌లో ఉన్న శశాంక్ ఏకంగా ఐదు ఫోర్లు కొట్టాడు.

మ్యాచ్ ప్రారంభంలో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (47; 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) బ్యాట్ ఝుళిపించాడు. మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ 5 (8), అజ్మతుల్లా ఒమర్జాయ్ 16 (15), స్టాయినిస్ 20 (15) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రబాడ, రషీద్ ఖాన్ తలో వికెట్ తీశారు.

**శ్రేయస్ సెంచరీ ఇన్నింగ్స్**

ఐపీఎల్‌లో తొలి సెంచరీ చేసే అవకాశాన్ని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేజార్చుకున్నాడు. సెల్ఫ్‌లెస్ క్రికెట్ ఆడిన ఈ ప్లేయర్.. వ్యక్తిగత స్కోరు కంటే.. జట్టే ముఖ్యమని చాటి చెప్పాడు. 19వ ఓవర్ ముగిసే సరికి 97* రన్స్‌తో నాటౌట్‌గా ఉన్నప్పటికీ.. శశాంక్ సింగ్‌కు సింగిల్ కోసం కాకుండా.. హిట్టింగ్ చేయమని సూచించాడు. దీంతో కెప్టెన్ అయ్యర్‌పై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా తొలిసారి బరిలోకి దిగిన భారత బ్యాటర్ శ్రేయస్ అయ్యర్.. ఐపీఎల్ 2025ను ఘనంగా ఆరంభించాడు. ఈ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పంజాబ్ కెప్టెన్.. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే బౌండరీల మోత మోగించాడు. బంతి పడటమే ఆలస్యం.. స్టాండ్స్‌లోకి పంపించడమే అన్నట్లుగా ఆడాడు.

టాస్ గెలిచిన గుజరాత్ బౌలింగ్ ఎంచుకోవటంతో పంజాబ్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఔట్ కావడంతో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్‌ను.. అడ్డుకునేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకపడ్డ అతడు.. ఐపీఎల్‌లో తన తొలి శతకం సాధించేలా కనిపించాడు. కానీ అనూహ్యంగా సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ఔట్ కాకపోయినా.. చివరి ఓవర్‌లో ఒక్క బంతి కూడా ఎదుర్కోకుండా.. సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కాగా ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ తలుచుకుంటే ఈజీగా సెంచరీ చేసేవాడే. చివరి ఓవర్‌లో రెండో బంతికి శశాంక్ సింగ్ రెండు పరుగులు తీశాడు. అయ్యర్.. సెంచరీ కోసం చూసి ఉంటే.. స్ట్రైక్‌లోకి వచ్చేవాడే. మిగిలిన నాలుగు బంతుల్లో ఒక్క బౌండరీ కొట్టినా సెంచరీ పూర్తి చేసుకునే వాడు. కానీ అతడు మాత్రం అలా చేయలేదు. ఈ ఓవర్ ప్రారంభానికి ముందే.. శశాంక్ సింగ్‌తో మాట్లాడిన శ్రేయస్.. “నా సెంచరీ కోసం ఆలోచించకు నీవు హిట్టింగ్ చేయు” అని చెప్పాడు. కెప్టెన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో శశాంక్ సింగ్ చెలరేగిపోయాడు. సిరాజ్ వేసిన ఈ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ రాబట్టాడు. మొత్తంగా ఈ ఓవర్‌లో 4 2 4 4 Wd 4 4 స్కోరు నమోదు చేశాడు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ క్రమంలో సెల్ఫ్‌లెస్ ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# నాకు హోం ఇష్టం

(మొదటి పేజీ తరువాయి )

ప్రచారమవుతున్నాయి. మొత్తంగా ఆరు మంత్రి పదవులకు అవకాశం ఉండగా.. ఈసారి నాలుగురికి ఛాన్స్ ఇవ్వనున్నట్టు సమాచారం. అయితే.. రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు గట్టిగా వినిపిస్తోంది. మంత్రి పదవి మీదే కాదు.. ఏ శాఖ కూడా ఇవ్వనున్నారన్నది కూడా పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. మంత్రి పదవిపై తన మనసులో మాట బయటపెట్టారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఈసారి కేబినెట్ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందనుకుంటున్నట్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. తనకు హోంశాఖ అంటే ఇష్టమని మనసులో మాట చెప్పారు. ఈ క్రమంలోనే.. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని.. ప్రజల పక్షాన నిలబడతానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని అభిప్రాయపడ్డారు. కేబినెట్ విస్తరణపై ఢిల్లీలో సీరియస్‌గానే చర్చ జరిగినట్లుందని చెప్పిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. తనకు ఇప్పటివరకు ఢిల్లీ నుంచి ఎలాంటి ఫోన్ రాలేదని స్పష్టం చేశారు. త్వరలో చేపట్టనున్న కేబినెట్ విస్తరణలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమంటు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఆయన చేసిన ఇంట్రెస్టింగ్ కామెంట్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కాగా.. తెలంగాణలో కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం





రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా.. ఇందులో నాలుగింటిని భర్తీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అది కూడా ఉగాది పండుగ వరకు.. భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఈ మంత్రి పదవుల కోసం చాలా మంది ఆశావాహులు ఉండగా.. మంత్రి పదవులు దక్కని వారికి డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను ఇవ్వాలని యోచిస్తున్నట్టు సమాచారం. కాగా.. డిప్యూటీ స్పీకర్ పదవి ఎస్టీలోని లంబాడకు ఇవ్వడంపై చర్చించినట్లు తెలిసింది. చీఫ్ విప్ పదవి మాదిగ సామాజికవర్గానికి లేదంటే బీసీలో మంత్రి పదవి దక్కని మరో సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే.. కేబినెట్ విస్తరణలో సామాజిక సమతుల్యం తప్పక పాటించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. బీసీ, ఎస్సీ, మైనార్టీ, రెడ్డి సామాజిక వర్గాలకు ఒక్కో పదవి ఇచ్చే అవకాశం ఉంది. అయితే.. కొత్తగా నలుగురిని కేబినెట్లోకి తీసుకోనుండటంతో పాటు ముగ్గురు, నలుగురు మంత్రుల శాఖల్లో మార్పు జరిగే ఆస్కారం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒక మంత్రిని కూడా కేబినెట్ నుంచి తప్పించే అవకాశం కూడా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# కేటీఆర్.. పోలీసులతో పెట్టుకోకు..!

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇచ్చారంటూ సంచలన విషయాలు వెల్లడించారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. పోలీసులు ఎప్పుడూ అధికారంలో ఉన్నవారికి అనుగుణంగానే పనిచేస్తారంటూ వెల్లడించారు. కేటీఆర్ ఈ విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలను పోలీసులు ఎన్నోసార్లు జైలుకు పంపించారని, లాఠీఛార్జ్ కూడా చేశారని గుర్తు చేశారు. తనపై కూడా పీడీ యాక్ట్ పెట్టించి జైలుకు పంపించారని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనను పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసినప్పుడు సొంత పార్టీ నేతలే పోలీసులకు సపోర్ట్ చేశారని రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక పోలీస్ అధికారే స్వయంగా ఈ విషయం తనతో చెప్పారని అన్నారు. ఆ అధికారి తనతో "రాజాసింగ్.. నీ పైన పీడీ యాక్ట్ వేస్తున్నాం. మీ బీజేపీ వాళ్లు కూడా వేయండి అన్నారు." అని చెప్పినట్లు రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే తనను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులను ఏం చేయాలో చెప్పాలని





కేటీఆర్‌ను రాజాసింగ్ ప్రశ్నించారు. ఇప్పటికీ తన పార్టీలోని కొందరు అధికారులు తనను వెన్నుపోటు పొడవాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. తాను జైలులో ఉన్నప్పుడు తన అన్న, కార్యకర్తలు తనకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడు తన అన్న ఎటువైపు ఉన్నారో అర్థం కావడం లేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# మంత్రి కన్నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆ యువకుడు చెప్పిన మాటలు విని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా చలించిపోయారు. తీవ్ర భావోద్వేగాన్ని అపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని పలిమేల మండలం సర్వాయ్‌పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ అనే యువకుడు కాన్సర్‌తో బాధపడుతూ. హైదరాబాద్ ఖాజాగూడలోని స్పర్శ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు.. స్వయంగా ఆసుపత్రికెళ్లి నితిన్‌ను పరామర్శించారు. నితిన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నితిన్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు.. ధైర్యం చెప్పారు. తానున్నాననే భరోసానిచ్చారు. తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని, పెద్ద క్రికెటర్ అవ్వాలని ఎన్నో కలలు కన్నట్టు నితిన్ చెప్తున్న క్రమంలో భావోద్వేగానికి గురయ్యారు. నితిన్ మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్పటికప్పుడు.. తన సిబ్బందికి చెప్పి క్రికెట్ కిట్ తెప్పించి.. నితిన్ కోరికను నెరవేర్చారు. అంతేకాదు.. "సొంతన్నలా నితిన్‌కు అండగా ఉంటా.. ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి.." అంటూ యువకుడి తల్లిదండ్రులకు మంత్రి శ్రీధర్ బాబు ధైర్యం చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. క్యాన్సర్ నుంచి నితిన్ తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. మంత్రి శ్రీధర్ బాబు చేసిన పనికి అభినందనలు చెప్తున్నారు. కాగా.. ప్రభుత్వం తరపున నితిన్‌కు మెరుగైన వైద్యం అందించి.. అతన్ని కాపాడాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

# మీ ఇద్దరి హవానే నడుస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తుంది. మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు బీసీలకు, ఒక రెడ్డి సామాజిక వర్గానికి, ఒక ముస్లిం సామాజిక వర్గానికి, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి మంత్రులుగా అవకాశం ఇచ్చే పరిస్థితి ఉంది. అయితే ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ప్రస్తుతం రాజకీయ వర్గాలలో కూడా ఆసక్తికర సంభాషణలు చోటుచేసుకుంటున్నాయి. మొత్తానికి సాధించారు అంటూ వివేక్ తో మల్లారెడ్డి వ్యాఖ్యలు నేడు తెలంగాణ అసెంబ్లీ లాబీలో ఆసక్తికర విషయం పైన చర్చ జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పలకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన గడ్డం వివేక్ వెంకటస్వామి తో సరదా సంభాషణ చేశారు. వివేక్ వెంకటస్వామి తో మాట్లాడిన మల్లారెడ్డి మొత్తానికి సాధించారు.. సీఎం, డిప్యూటీ సీఎం కంటే ముందే ఢిల్లీ వచ్చారు అంటూ మల్లారెడ్డి వ్యాఖ్యలు చేశారు.

**వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హడావుడి మాత్రమే నడుస్తోందని చలోక్తులు**

అందుకు వివేక్ వెంకటస్వామి లేదు.. నేను వేరే పని మీద వెళ్లాను అంటూ సమాధానం ఇచ్చారు. ఇక ఆయన మాటలను వింటున్న మల్లారెడ్డి పట్టించుకోనట్టే మాట్లాడుతూ రాష్ట్రంలో వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హడావుడి మాత్రమే నడుస్తోంది అంటూ చలోక్తులు విసిరారు. ఇక ఆ మాటకు వివేక్ వెంకటస్వామి నవ్వుతూ కెసిఆర్, మల్లారెడ్డి కుటుంబాలది కూడా నడుస్తుంది కదా అంటూ రివర్స్ పంచ్ వేశారు.

**వివేక్ మంత్రి పదవి పక్కా.. మల్లారెడ్డి చెప్పిందిదే**

మల్లారెడ్డి ఇప్పుడు మాది నడవడం లేదు, అంతా మీ రాజ్యమే అంటూ వ్యాఖ్యలు చేశారు. మొత్తానికి ఈ ఆసక్తికర సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వివేక్ మంత్రి పదవి పక్కా అని మల్లారెడ్డి వ్యాఖ్యలతో తాజాగా అందరికీ అర్థం అయ్యింది.

# ఆ మాట విత్ డ్రా చేసుకుంటున్నా

(మొదటి పేజీ తరువాయి)

మనసు కష్టపడితే తన వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకుంటానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెల్లడించారు. సునీతా లక్ష్మారెడ్డి అంటే తనకు గౌరవమని అన్నారు. మహిళలంటే తనకు ఎనలేని గౌరవమని.. తనకూ 8 మంది సిస్టర్స్ ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా సునీతా లక్ష్మారెడ్డిని తాను ఏమీ అనలేదని.. ఒక వేళ ఆమె మనసుకు బాధ కల్గించి ఉంటే తన వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకుంటానని అని స్పీకర్ వెల్లడించారు.

**అసలేం జరిగిందంటే..**

సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా.. సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతుండగా గందరగోళం నెలకొంది. చాలా మంది సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేశారు. సభలో ఎవరు ఏం మాట్లాడుతున్నారో ఏమాత్రం అర్థం కాలేదు. మధ్యలో కలుగజేసుకున్న స్పీకర్.. 'సభలో రన్నింగ్ కామెంట్రీ జరుగుతోంది. నాకేం వినాలనిపించటం లేదు.. మీకైనా వినాలనిపిస్తుందా..?' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు తనను ఉద్దేశించి మాట్లాడినవేనని సునీతా లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇవాళ సభ ప్రారంభం కాగానే స్పీకర్ వ్యాఖ్యలు తనను బాధించాయని ఆవేదన వ్యక్తంచేశారు. స్పీకర్ స్థానంలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేస్తారనుకోలేదని చెప్పారు. తాను ఎక్కడా పరిధి దాటి మాట్లాడలేదని, సబ్జెట్ డీవీయేట్ కాలేదన్నారు. అయినా తన పట్ల స్పీకర్ అలా మాట్లాడటం చాలా బాధేసిందన్నారు. తన విషయంలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలు మంచివే అనిపిస్తే రికార్డులో ఉంచాలని లేదా వాటిని రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్..తాను ఎవరిని ఉద్దేశించి అలా అనలేదని చెప్పారు. తన మాటాలను పొరపాటుగా అర్థం చేసుకున్నారని.. తనకు మహిళలంటే గౌరవం ఉందని చెప్పారు. తనకు 8 మంది సిస్టర్స్ ఉన్నారని చెప్పారు. కావాలని తాను ఏ ఒక్కర్నో ఉద్దేశించి అలా అనలేదని.. రన్నింగ్ కామెంట్రీ ఇస్తుండటంతోనే అలా అనాల్సి వచ్చిందని అన్నారు. ఒక వేళ తన వ్యాఖ్యల వల్ల సునీతా మనసు బాధ కలిగి ఉంటే ఆ వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకుంటున్నానని సభలో వెల్లడించారు.



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో తాజాగా మరో మృతదేహం లభ్యమైంది. కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో రెస్క్యూ సిబ్బంది ఓ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. నెల రోజుల క్రితం టన్నెల్‌లో 8 మంది బాధితులు చిక్కుకోగా.. ఇటీవల వ్యక్తి డెడ్ బాడీని వెలికి తీశారు. ఇంకా ఏడుగురి మృతదేహాలు అందులోనే ఉండగా.. తాజాగా ఒకర్ని గుర్తించారు.

**టన్నెల్ ప్రమాదంలో మరో మృతదేహం లభ్యం**

శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదంలో మరో మృతదేహం లభ్యమైంది. ఇవాళ ఉదయం రెస్క్యూ సిబ్బంది తవ్వకాలు జరుపుతుండగా మృతదేహం ఆనవాళ్లు లభించాయి. కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో దుర్వాసన వస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది.. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ముందుగా గుర్తించిన అనుమానిత ప్రాంతాలు డీ1, డీ2 కాకుండా మరోచోట తవ్వకాలు జరుపుతుండగా ఈ మృతదేహం ఆనవాళ్లు లభించాయి. గ్యాస్ కట్టర్ల సాయంతో కన్వేయర్ బెల్ట్ శిథిలాలను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన జరిగిన నెలా 3 రోజుల తర్వాత రెండో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు ఎవరనేది తెలియాల్సి ఉంది. కాగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఇప్పటికే నెల రోజులు గడిచిపోయింది. గత నెల 22న ప్రమాదం జరగ్గా.. అందులో చిక్కుకున్న 8 మంది ఆచూకీ కోసం దేశంలోనే అన్ని ప్రముఖ రెస్క్యూ టీంలను రంగంలోకి దింపారు. ఆర్మీ. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, కేరళ కేడావర్ డాగ్స్ స్క్వాడ్ వంటి వాటితో రెస్క్యూ చేపట్టారు. గత 15 రోజుల క్రితం గురుప్రీత్ సింగ్ అనే కార్మికుడి మృతదేహం లభ్యమైంది. అప్పటి నుంచి తవ్వకాలు చేపడుతున్నా ఎలాంటి పురోగతి లభించలేదు. టన్నెల్ లోపల ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భారీగా మట్టి పేరుకుపోవటం, నీటి ఊట ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని అంటున్నారు. అయితే టన్నెల్ ప్రమాద ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన ఏడు నిమిషాల్లోనే అందులో చిక్కుకున్న 8 మంది కార్మికులు మృతి చెంది ఉంటారని అధికారులు వెల్లడించారు. కనీసం వారి మృతదేహాలైనా కుటుంబ సభ్యులకు అందించాలన్న ఉద్దేశ్యంతో తవ్వకాలు జరుపుతున్నట్లు చెప్పారు. ఇక ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారులు, మంత్రులతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్ పైకప్పు బలహీనంగా ఉందని.., అది కూలిపోయే అవకాశం కూడా ఉందని అధికారులు సీఎంకు చెప్పినట్లు తెలిసింది. కాగా, అందులో చిక్కుకున్న వారి మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సీఎం అధికారులను ఆదేశించిటన్లు సమాచారం.

# డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం చర్యలు

## లోక్ సభలో వెల్లడించిన కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్

## ఇప్పటివరకు 7.81 లక్షల సిమ్ కార్డులు డీయాక్టివేట్

## 83 వేల వాట్సాప్ ఖాతాలు నిలిపివేత

## 2,08,469 ఐఎమ్ఈఐలను బ్లాక్ చేసిన ప్రభుత్వం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు తీసుకున్న చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 7.81 లక్షల సిమ్ కార్డులను, 83 వేల వాట్సాప్ ఖాతాలను నిలిపివేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లోకసభలో వెల్లడించారు. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు పొంది డిజిటల్ మోసాలకు పాల్పడుతున్న వారి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బండి సంజయ్ తెలిపారు. అంతేకాకుండా, 2,08,469 ఐఎమ్ఈఐలను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. ప్రతి ఫోన్‌కు కేటాయించే ప్రత్యేక సంఖ్య ఐఎమ్ఈఐ అని, డిజిటల్ అరెస్టుల కోసం వినియోగిస్తున్న 3,962 స్కైప్ ఐడీలను, 83,668 వాట్సాప్ ఖాతాలను భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ గుర్తించి బ్లాక్ చేసిందని వివరించారు. 2021లో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటైందని, దీని ద్వారా ఇప్పటివరకు 13.36 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని, సుమారు రూ. 4,386 కోట్లు కాపాడగలిగామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులే లక్ష్యంగా జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని బండి సంజయ్ తెలిపారు. డిజిటల్ నేరాలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https://cybercrime.gov.in) అందుబాటులో ఉందని, దీని ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అధికారులు చర్యలు చేపడతారని వివరించారు.



# చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్ నగరంలోని పలు చెరువులను పరిశీలించారు. ఖాజాగూడలోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపుతున్న వంశీరామ్ బిల్డర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిని మూడు రోజుల్లో తొలగించాలని బిల్డర్లను హెచ్చరించారు. మట్టిని తొలగిస్తామని వంశీరామ్ బిల్డర్లు కూడా తెలిపారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తెలుసుకోవడానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని అన్నారు. ఆ తర్వాత మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బోరబండ సమీపంలోని సున్నం చెరువును సందర్శించారు. ఈ రెండు చెరువుల్లో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. చెరువుల చుట్టూ తిరిగి, సుందరీకరణ, పచ్చదనం పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. హైడ్రా ఈ ఏడాది చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వచ్చే వర్షాకాలానికి పూర్తి కావాలని, పనుల్లో ఎక్కడా జాప్యం, అలసత్వం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.